

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!

## - 27 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ముహూర్తకాలంలో కనీ వినీ ఎరుగని దృశ్యాలకు వేదిక అయ్యింది కృష్ణరాయల మహలు. చేయెత్తున ఉన్నదర్బారు హాలును ఒక్క గంతులో అధిరోహించాడు కృష్ణరాయలు. నగిషీలు చెక్కిన సింహాసనంలాంటి ఉన్నతాసనంలో స్పృహకోల్పోయి ఉన్నాడు బాలుడు భవానీప్రసాదరాయలు. ఎత్తైన పైకప్పు దివ్యమైన తైలవర్ణచిత్రాలతో అలంకరింపబడి ఉన్నది. అందమైన గాజు దీపపు సెమ్మెలు లోపలున్న దీపపు కాంతులను రంగులలో ప్రతిఫలిస్తున్నాయి. చీనా నుండి పర్షియా నుండి తెప్పించిన ఖరీదైన గాజు చిమ్నీలు అవి. మలబారు అడవులనుండి తెప్పించిన జాతి కలప దూలాలు అందమైన చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. విశాలమైన ఆ హాలుగోడలను పందిరిలా అల్లుకుని ఉన్నాయి ఆ దృఢమైన దూలాలు. మధ్యలో ఉన్న దూలం మీద నిలువెత్తునా నిలిచి కోపంగా నోరుతెరిచి ధ్వనులు చేస్తూ రొమ్ములు బాదుకున్నది 'రాం బోలా'! బలమైన మోకులా వ్రేలాడుతున్న రాంబోలా తోకకు వ్రేలాడుతున్నాడు అంతవరకూ సింహంలా చెలరేగిన మర్మయుద్ధవీరుడు.

అతడి మెడకు బలంగా బిగుసుకుని ఉన్న తోకను ఎర్రగా మెరిపిస్తూ చుక్కలు చుక్కలుగా కారుతున్నది చిక్కని రక్తం. అతడి ఎదురురొమ్ము మీదుగా, నడుముకు చుట్టుకున్న దట్టీ మీదుగా, క్రిందకు కారుతున్నది యిప్పుడిప్పుడే. మెడ ఎముక విరిగి చెవి వెనుక పైకి తేలింది. మెడ, తల అసహజంగా వంకర తిరిగిపోయాయి. వికృతంగా తెరుచుకున్న కనులలో యింకా క్రూరత్వం ఉట్టిపడుతూనే ఉన్నది! కృష్ణరాయలతో పాటే గాలిలో ఎగురుతున్నట్టు అక్కడికి చేరుకున్న సమర్థరాముడు బాలుడిని చూపిస్తూ సేదదీర్చుమని సూచిస్తూ, ఆ దుర్మార్గుడి నడుముకున్న వస్త్రాన్ని ఒక్క ఉదుటున విప్పదీసి వ్రేలాడుతున్న శరీరంక్రింద నేలమీద దట్టంగా పరిచాడు. రెండు మూడు లిప్తల వ్యవధితో అక్కడికి చేరుకున్నారు రాయల అంగరక్షకులు, మహంతులు.

'ఇతని రక్తం ఒక్క బిందువు కూడా ఇక్కడ పడకూడదు' గంభీరంగా ఆదేశించాడు సమర్థరాముడు. అంగరక్షకులు ఆ మృతశరీరాన్ని సమీపించగానే చుట్టుకున్న తోకను సడలించింది రాంబోలా. మరుక్షణంలో అక్కడినుండి ప్రాంగణంలోకి మోసుకొచ్చారు. దట్టంగా ఆకులు వస్త్రమూ పరిచి వాటి మీద ఆ శవాన్ని పడుకోబెట్టారు.

మహలు సింహద్వారాన్ని అప్పుడు తెరిపించాడు సమర్థుడు. నిశ్చేష్టురాలైన లక్ష్మీబాయిని, బాలుడిని ఉపచారాలతో సేద దీరుస్తున్నారు సేవకురాళ్ళు. ఎప్పుడు చేరుకున్నాడో, సమర్థ రాముడు తన ప్రియశిష్యులు కళ్యాణుడిని, ఉద్ధవుడిని కనులు తెరిపించే ప్రయత్నం చేస్తున్నాడు. బాలుడు,లక్ష్మీబాయితేరుకోవడంతో సమర్థుడిని సమీపించిన కృష్ణరాయలు సంభ్రమానికి గురిఐనాడు.

అంతవరకూ ఎవరూ ఎన్నడూ చూడని సమర్థరాముడు కనిపిస్తున్నాడు. ఆయన చేతిలో ఉన్న బాణం ఒక పరికరంలా మెరుస్తున్నది. పదునైనబాణపు మొనతో శిష్యుల శరీరాలను గుచ్చుతున్నాడు. మర్మయుద్ధ మహావీరుడిని నేలమీద పడవేసి అతని రెండు చేతులూ రెండు కాళ్ళూ తొక్కిపట్టి నిలుచున్నపుడు వారి ముఖాలు విజయ గర్వంతో మెరిశాయి. ఇప్పుడు కళతప్పి ఉన్నాయి. జీవకళ లేక వాడిపోయిన పూలలా నేలమీద పడివున్నారు. కాళ్ళూ చేతులు నేలకు తన్నిపట్టి గాలిపటంలా పైకి లేచినపుడు వారిని ఎండుటాకులలా ప్రక్కకు విసిరేశాడు ఆ వీరుడు.

'కంటికి కనిపించని వేగముతో వీరిని గాయపరిచాడు కృష్ణోబా! భవానీప్రసాదు పరిహాసంగా నవ్వడమే వీరిని రక్షించింది. లేకుంటే వీరిని వదిలేవాడు కాదు అతడు' ఒకప్రక్కన తన పని కొనసాగిస్తూనే కృష్ణరాయలకు వివరించాడు. ఛాతీ క్రింద కుడిప్రక్కన, కుడి చెవి వెనుక ప్రక్కన,ఎడమ చేతి మణికట్టుకు మోచేతి మడతకు మధ్యన వేగంగా ఒక క్రమపద్ధతిలో పొడిచాడు సున్నితంగా.

'చేతివ్రేళ్ళు, కట్టెలు ఉపయోగించవచ్చు కృష్ణోబా! మర్మసంధులను ఒత్తిడికి గురిచేయడం ప్రధానం. పదునైన మొనలతో యింకా నిశితంగా సూక్ష్మమైన సంధిస్థానాలను కొట్టవచ్చు, కానీ తీవ్ర సాధన కావాలి!' చంపడానికీ యివే మర్మసంధులు, యివే ఆయుధాలు! బ్రతికించడానికీ యివే మర్మస్థానాలు, యివే ఆయుధాలు! చిరునవ్వుతో చెప్పాడు. సంహారకుడు, సంరక్షకుడూ రఘువీరుడే కదా! సమస్త జీవులలో ఆయనే కదూ! అన్నాడు మళ్ళీ. యిప్పుడు కుడి తొడలు, మోకాలి క్రింద, చీలమండల మీద గుచ్చుతున్నాడు. కుడిపాదాల పెద్దవ్రేళ్ళమీద బాణపు మొనను కొద్దిసేపు సున్నితంగా నొక్కిపట్టి వుంచాడు.

అప్పటిదాకా అచేతనంగా పడివున్నారు కళ్యాణుడు, ఉద్ధవుడు. కళతప్పిన ముఖాలలో వెలుగు తిరి రావడం స్పష్టంగా గమనించాడు కృష్ణరాయలు. అప్పటిదాకా కమ్ముకున్న మబ్బులు గాలికి చెల్లాచెదురై, చంద్రుడు బయటపడ్డట్టు వారి ముఖాలు తేటపడ్డాయి కానీ కదలికలకూ చేతకాని నిస్సత్తువతో ఉన్నారు. ఆయన సూచనమేరకు వారిని సున్నితంగా దొర్లించి బోర్లా పడుకోబెట్టారు మహంతులు.

వెన్నెముక చివరన, ఆ తరువాత నాలుగేసి అంగుళాలు వదిలి మెడ ఎముక చివర వరకూ అయిదు స్థానాలలో సున్నితంగా అదిమిపెట్టి ఉంచాడు బాణపు మొనను. మొదలు వారి కాళ్ళు, ఆ తరువాత చేతులు, తొడలు, పిరుదులు కంపించడం స్పష్టంగా కనిపించింది. ఆ స్థానాలలో కండరాలు ఎగిరిపడడం కనిపించింది. రెండుసార్లు దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు చేశారు. దుమ్ము ధూళి ముక్కులలోకి వెళ్ళినట్లు ఉన్నట్టుండి పెద్దగా మూడేసి మార్లు తుమ్మి, అప్పుడు లేచి కూర్చున్నారు ఉద్ధవుడు, కళ్యాణ్ స్వామి!

వారి తలలమీద అరచేతిని ఉంచి మౌనంగా దివ్యమైన జీవమంత్రాన్ని, శ్రీరామ మంత్రాన్ని మననం చేశాడుసమర్థరాముడు. సమస్త మృత్యుగండాలను, భయాలను నాశనం చేసే మంత్రం అది. సాక్షాత్తూ హనుమ ఉపదేశించినది. దానికి ఆయనే ఋషి, శ్రీరామచంద్రుడు దేవత, ఐదక్షరముల మహామంత్రం! దానిని సిద్ధింపజేసుకున్నవాడు స్వేచ్ఛా మరణాన్ని పొందుతాడు. వజ్రకాయుడు అవుతాడు. సిద్ధింపజేసుకున్న సాధకుడు కరుణిస్తే, ఏ రుగ్మతా లేని శతాధిక వత్సర పూర్ణాయువు కలుగుతుంది.

ఆయన పాదాలమీద నుదురు తాకించి సాష్టాంగదండప్రణామం చేశారు శిష్యులు. ఆయన ఆజ్ఞ ప్రకారం వెళ్లి పర్ణశాలలో సుఖాసనంలో ధ్యాన సమాధిలో మునిగిపోయారు.'యితడికి ప్రత్యేకంగా ఉత్తరక్రియలు చేయాలి కృష్ణోబా! మహా సాధకుడు! మహోపాసకుడు!' కృష్ణరాయలను ఆదేశించాడు సమర్థరాముడు. దానికి ఏర్పాట్లకు పురమాయించాడు కృష్ణరాయలు.

'యుద్ధపర్వంముగిసింది కృష్ణోబా! యిక నీపై దాడి జరుగదు. తానీషా దర్బారుకు సమాచారం పంపించు. ఇంతవరకూ జరిగిన ప్రయత్నాలను అన్నిటినీ వివరించు' అంటూ ఆదేశించాడు సమర్థుడు.

'చిత్తం గురుదేవా! యితడు ఎవరు స్వామీ? మీకు ఎలా పరిచితుడు? తెలుసుకోవచ్చా?' సందేహిస్తూ అడిగాడు కృష్ణరాయలు.

'పంపా తీరంలో, మలబారు మహారణ్యాలలో మర్మవిద్యలో యిద్దరు సహాధ్యాయులు కృష్ణోబా! అపర అగస్త్యుడు వారి గురుదేవుడు! వారిద్దరూ మర్మవిద్యలో చివరిమహాగురువులు! వారిలో ఒకడు యితడు' అని కొంతసేపు మౌనం వహించాడు సమర్థరాముడు. 'నా సహాధ్యాయి.. కృష్ణోబా!' అన్నాడు మహంతులు మోసుకువెళ్తున్న మృతకళేబరాన్ని చూస్తూ!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS